క్లుప్తంగా

నిర్మల్ పట్టణ సీఐగా అనిల్



నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణ సీఐగా అనిల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం పోలీసు శాఖలో బదిలీలు చేపట్టింది. నిర్మల్ పట్టణ సీఐగా పని చేసిన పురుషోత్తంను బదిలీ చేస్తూ మల్టీజోన్–1 కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వారి స్థానంలో నిజామాబాద్ జిల్లాలో సీఐగా పని చేసిన అనిల్ నిర్మల్ పట్టణ సీఐగా బదిలీపై వచ్చారు. నూతన సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల దృష్ట్యా పట్టణవాసులు సహకరించాలని సూచించారు. అనంతరం వారికి పోలీసు సిబ్బంది, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వాహనాలు తనిఖీ

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సు, బీమా, ఆర్‌సీ వంటి ధ్రువపత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ నర్సయ్య, పీసీ అశోక్, సతీశ్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛంద సంస్థ చేయూత



సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామంలో పనాంకర్ రేఖ కుటుంబానికి వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ చేయూతనిచ్చింది. సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పించేందుకు ఆమెకు రూ.15వేల విలువైన లాండ్రీషాపు ప్రారంభించేందుకు ఇస్త్రీ పెట్టె, టేబుల్, బొగ్గులు అందించారు. వెంకటరెడ్డి, వరల్డ్ విజన్ సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ హనుమన్న, స్పాన్సర్‌షిప్ కోఆర్డినేటర్ విజయ్ భాస్కర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కూతురి వివాహానికి హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే



వధూవరులతో ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూతురు వివాహానికి గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పెళ్లి వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

బాబా ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయి బాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి కనిపించింది. వివిధ గ్రామాల నుంచి మహిళలు పాదయాత్రగా ఆలయానికి వచ్చి బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నర్సారెడ్డి సేవలు మరువలేనివి

ఖానాపూర్: మాజీ మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి సేవలు మరువలేనివని లింగాపూర్ సింగిల్‌విండో మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంఏ వకీల్ అన్నారు. గురువారం నిర్మల్‌లో మంజులాపూర్ మారుతి ఇన్ హోటల్‌లో నర్సారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదర్మాట్ ఆధునీకరణలో కాల్వను విస్తరించి చివరి ఆయకట్టుకు నీటిని అందించారని గుర్తు చేసుకున్నారు. కడెం మండలం లింగాపూర్, మాసాయిపేట, ఎల్లగడప గ్రామాలకు ప్రత్యేక కెనాల్ ఏర్పాటు చేయించారని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త ముంజ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడకు శుక్రవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ రానున్నట్లు బీజేపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. రైతువేదికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీతోపాటు అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారని అన్నారు.

నేటి నుంచి శ్రామ్‌నేర్ శిబిర్

తానూరు: మండలంలోని బెంబర గ్రామంలోని ఆనంద్ బుద్ధ విహార్‌లో ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు శ్రామ్‌నేర్ శిబిర్ నిర్వహించనున్నట్లు భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు వాగ్మారే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బౌద్ధమహాసభ నాయకులు హాజరవాలని కోరారు.

ఊరూరా బెల్టు దందా

- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- అనుమతుల్లేకుండా షాపుల నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



ఎన్నికల వేళ బెల్ట్‌షాపులో పట్టుకున్న మద్యంతో అధికారులు (ఫైల్)

ఖానాపూర్: ఊరూరా..వీధి వీధినా..బెల్ట్‌షాపులు రోజురోజుకూ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఆదాయం వచ్చే వ్యాపారం కావడంతో అక్రమమని తెలిసినా పట్టణంతోపాటు పల్లెల్లో చాలా మంది యథేచ్ఛగా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. స్థానికంగానే దొరుకుతుండటంతో పెద్దవారితోపాటు యువత కూడా మద్యానికి బానిసగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. దీనినే అవకాశంగా మల్చుకుంటున్న బెల్టుషాపుల నిర్వాహకులు మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. డిమాండ్‌ను బట్టి ఒక్కో మద్యం సీసాకు అదనంగా రూ.20 నుంచి రూ.50వరకు వసూలు చేస్తున్నారు.

నిరంతరం అందుబాటులో..

అనుమతి ఉన్న మద్యం దుకాణాల్లో(వైన్సులు) ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే విక్రయించాలని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కానీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అనుమతుల్లేకుండా వెలిసిన బెల్ట్‌షాపుల్లో మాత్రం 24 గంటలు మద్యం అందుబాటులోనే ఉంటుంది. దీంతో చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు అక్కడే మద్యం తాగి గొడవలకు దిగుతున్నారు. గతంలో బెల్ట్‌షాపులను చాటుమాటున నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం కొన్నిచోట్ల వీడీసీల అండదండలతో రోడ్లపైనే బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసుకొని మద్యం విక్రయాలు సాగిస్తున్నారు.

నకిలీ మద్యం విక్రయాలు..

పల్లెల్లోని బెల్టు దుకాణాల్లో మద్యాన్ని లూజ్(విడి)గా విక్రయిస్తుంటారు. దీంతో నకిలీ మద్యం విక్రయాలు జరిగే అవకాశం లేకపోలేదు. పలు చోట్ల రూ.లక్షలు వెచ్చించి టెండర్లు తీసుకున్నందున మద్యం బాటిళ్లపై అదనంగా డబ్బులు వసూలు చేయాల్సి వస్తోందని నిర్వాహకులే చెబుతున్నారు. పోలీసులు నిర్వహిస్తున్న డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పలుమార్లు పట్టుబడినా మందుబాబుల్లో మార్పు మాత్రం రావడం లేదు.

విచ్చలవిడిగా మద్యం సిట్టింగ్‌లు..

పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో వెలుస్తున్న దాబా హోటళ్లలో మద్యం సిట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దాబాల నిర్వహణ యథేచ్ఛగా సాగిస్తున్నారు. కేవలం ఎన్నికల వేళ మాత్రమే బెల్ట్‌షాప్‌లు, దాబాల్లో మద్యం సిట్టింగ్‌లను నిలిపివేస్తున్న అధికారులు.. తర్వాత పట్టించుకోవడం లేదు.

ఫిర్యాదు చేస్తే చర్యలు

అక్రమంగా బెల్ట్‌షాపులను నిర్వహించడంతోపాటు దాబాల్లో మద్యం సిట్టింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఎవరైనా తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం. పైరవీలకు తావు లేకుండా నిర్వాహకులపై కేసుల నమోదుతోపాటు తహసీల్దార్ కార్యాలయాల్లో బైండోవర్ చేస్తాం.

– లింబాద్రి, ఎస్సై, ఖానాపూర్

గుప్పుమంటున్న గుడుంబా..

బెల్ట్‌షాప్‌లకు తోడు పలు చోట్ల గుడుంబా విక్రయాలు జోరుగానే సాగుతున్నాయి. తక్కువ ధర కావడం.. బెల్ట్‌షాప్‌ల్లో అధిక ధర వెచ్చించలేని పేదలు చౌకగా లభించే గుడుంబా వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో అనారోగ్యం పాలవుతున్నారు. పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతున్న అక్రమ మద్యం వ్యాపారం అరికట్టాలని మహిళలు కోరుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వైద్యసేవలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన వైద్యులు

భైంసాటౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. భైంసా ఏరియా ఆస్పత్రిని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వార్డుల్లో కలియదిరుగుతూ రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. డయాలిసిస్ కేంద్రంలో బాధితులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. ఆస్పత్రిలో సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలు పరిశీలించారు. అనంతరం సూపరింటెండెంట్ కాశీనాథ్, వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఓపీ గదుల్లో కుర్చీలు, రోగులు వేచి ఉండేలా ప్రత్యేక గది, కుర్చీల ఏర్పాటు చేసేలా ప్రతిపాదించాలని కలెక్టర్ సూచించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదించాలని తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

కుభీర్ కేజీబీవీ తనిఖీ

కుభీర్: మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఉదయం నిద్రలేచే సమయం, చదువుకునే వేళలు, భోజనం పెట్టే సమయాలు, రాత్రి నిద్రపోయే సమయం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ చిన్నగా ఉందని, తలుపులు, కిటికీలు విరిగిపోయాయని విద్యార్థులు తెలిపారు. మరుగుదొడ్ల సక్రమంగా లేవని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తర్వాత వంట గది పరిశీలించి సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

పీహెచ్‌సీ స్థలం ఆక్రమణ..

కుభీర్ పీహెచ్‌సీ ఆవరణలో కొందరు షెడ్లు వేసుకుని అక్రమంగా వ్యాపారం చేస్తున్నారని, వాటిని తొలగించాలని మాజీ ఎంపీపీ బోయిడి విఠల్, సోషల్ జస్టిస్ చైర్మన్ సాప పండరి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ డీపీవోను పిలిచి అక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిశీలించేందు కు వెళ్లగా అక్కడ వారసంత జరుగుతుండడంతో దూరం నుంచి చూసి వెళ్లిపోయారు. కస్రా గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. వారి వెంట డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హన్మాండ్లు, డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్ సోము, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో చంద్రకాంత్, సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీదేవి, కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఈవో విజయ్ ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

భైంసారూరల్: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండలంలోని మిర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మల్లికార్జున్, సత్యనారాయణ, శ్రీనివాస్, అరుణ ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

ఖానాపూర్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నతస్థానంలో రాణించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, ఖానాపూర్ ఎస్సై లింబాద్రి అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని ధ్రువ హైస్కూల్‌లో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ఫోన్ల వినియోగంతో ఏకాగ్రత, క్రమశిక్షణ తగ్గిపోతోందన్నారు. చదువుతోనే గౌరవం వస్తుందని.. బాగా చదివి తల్లిదండ్రులతోపాటు పాఠశాలకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రశాంత్ ఉన్నారు.

సన్మానం

ఖానాపూర్: పట్టణంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్‌చైర్మన్ కావలి సంతోష్‌ను గురువారం కాంగ్రెస్ నాయకులు, యువజన సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. సమష్టిగా ఉంటూ పట్టణాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కరిపె రాజు, అమంద స్వామి, బొడికె సంతోష్, కరిపె రాజేశ్వర్, వినోద్, చిరంజీవి, సిద్ధార్థనాయక్ తదితరులు ఉన్నారు.

కడెం: ఖానాపూర్‌లో మున్సిపల్ చైర్మన్ సత్యంను కడెం మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, వాజీద్ ఖాన్, భూమేశ్, సలీం, రఫీక్, రమేశ్, బబ్లూ తదితరులు ఉన్నారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న నడింపల్లెలో గురువారం పోచమ్మ తల్లి (శీతలాదేవి) విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు రేవంత్‌రెడ్డి బృందం ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 3న పోచమ్మ బోనాలు, పట్నాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

'లంబాడాలకే టికెట్ ఇవ్వాలి'

కుభీర్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ టికెట్ బంజారాలకే(లంబాడా) ఇవ్వాలని గోర్ సేన మండలాధ్యక్షుడు జాదవ్ అజయ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో బంజార జనాభా ఎక్కువ ఉందన్నారు. గత ఎన్నికల్లో ఆదివాసీలకు ఎంపీ టికెట్ కేటాయించారని.. ఈ సారి బంజారాలకు ఇచ్చి సమన్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాథోడ్ కమలేశ్, రాథోడ్ అర్జున్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. పిచ్చిమొక్కలు తొలగించరూ..



తానూరు: మండలంలోని దాగాం నుంచి హంగిర్గా ఎక్స్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు రోడ్డుపైకి వచ్చిన పిచ్చి మొక్కలు తొలగించి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

శనగ పంట దగ్ధం



కాలిబూడిదైన పంట

తానూరు: మండలంలోని నంద్‌గాం శివారు ప్రాంతంలో షేక్ ఖదిర్‌కు చెందిన కోసి పెట్టిన శనగపంట దగ్ధమైనట్లు బాధిత రైతు తెలిపారు. తానూరు గ్రామానికి చెందిన షేక్ ఖదిర్ రెండున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని యాసంగిలో శనగపంట సాగు చేశాడు. రెండు రోజుల కిందట పంటను కోసి చేనులో కుప్పగా వేశాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పంటించడంతో కాలి బూడిదైపోయింది. సుమారు రూ.1.20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నిబంధనలు పట్టవా?





నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష కేంద్రాలైన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల వద్దే ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫ్లెక్సీలతో ప్రచారం ఏర్పాటు చేస్తూ విద్యార్థులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రభుత్వ కళాశాలల సిబ్బంది, సంబంధిత అధికారులు సైతం అలసత్వం వహిస్తూ గేటు బయట ప్రచారం కోసం ఏర్పాటు చేసిన ప్రైవేట్ కళాశాలల ఫ్లెక్సీలను తొలగించడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

వేధిస్తే 100కు ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న అధికారి

నిర్మల్‌టౌన్: ర్యాగింగ్ చేసినా.. వేధించినా ఆందోళన చెందకుండా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని షీటీం పోలీసులు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సహాయ అధికారి దేవోల్ల శ్రీలత పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఎస్సీ సంక్షేమ పాఠశాల విద్యార్థులకు షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930పై అవగాహన కల్పించారు. ఫొటోలు, వీడియోలు తీసుకునేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. షీ టీం నెంబర్ 87126 59550 అందరి వద్ద ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు రమాదేవి, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు ఉన్నారు.

శివలింగం, నంది ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో గణపతి వీరభద్రస్వామిసమేత భద్రకాళి దేవి శివలింగం నంది విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. గురువారం యాగశాల ప్రవేశం, అంఖడ దీపారాధన, ధ్వజారోహణం, గణపతిపూజ, గోపూజ, అంకురార్పణం, నంది సామారాధన స్వస్తి పుణ్యవచనం జరిపించారు. ప్రతిష్ఠాపన అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సభ్యులు భోజప్ప పటేల్, పీరాజీ పటేల్, ఆనంద్‌రావు పటేల్, కామన్న పటేల్, భూమన్నపటేల్, గంగాధర్ పటేల్, శంకర్‌పటేల్, దేవిదాస్ పటేల్, మారుతి పటేల్, లాలప్ప పటేల్, సురేశ్‌పటేల్ ఉన్నారు.

నువ్వు పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏఈఓ అంబాజీ

సోన్: మండలంలోని కూచన్‌పెల్లి గ్రామంలో గురువారం నువ్వుల పంటలను ఏఈఓ అంబాజీ క్షేత్రస్థాయిలో పరిశీలించి చీడపీడలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట మూడు వారాల నుంచి నెల రోజులకు చేరే క్రమంలో ఆకునల్లి, పేనుబంక, తామర పురుగు ఆశిస్తాయని పేర్కొన్నారు. దీని నివారణకు 0.6 మిల్లీలీటర్ల ఇమిడా క్లోప్రైడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాయ తొలుచు పురుగు నివారణకు లీటరు నీటిలో 2.5 మి.లీ క్లోరిఫైరిపాస్ కలిపి పంటపై పిచికారీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

'పది'లో మెరవాలి

- నేటి నుంచి ప్రీఫైనల్ పరీక్షలు
- జిల్లాలో 8,923 మంది విద్యార్థులు

నిర్మల్‌రూరల్: జిల్లాలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నుంచి ప్రీఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 18నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. నేటి నుంచి మొదలయ్యే ప్రీ ఫైనల్ పరీక్షలు, తర్వాత రాయబోయే పరీక్షల విధానం ఒకేలా ఉంటుంది. వీటిపై అవగాహన ఉంటే ఒత్తిడి లేకుండా రాసే అవకాశం ఉంది. పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతోపాటు ఇటీవల ప్రత్యేక పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్ని ఉపాధ్యాయులు సంసిద్ధులుగా తీర్చిదిద్దారు. అయినప్పటికీ ప్రశ్నపత్రం ఎలా ఉంటుందో.. తాము ఎలా రాస్తామోనని విద్యార్థులను ఆందోళన వెంటాడుతూనే ఉంది.

అవగాహన పెంచుకోవాలి..

గతంలో ప్రతి సబ్జెక్టుకు రెండు పేపర్లు, హిందీకి ఒకటి కలిపి మొత్తం 11 పేపర్లు విద్యార్థులు రాయాల్సి వచ్చేది. గతేడాది నుంచి సబ్జెక్టులకు ఒక పరీక్ష చొప్పున మాత్రమే నిర్వహిస్తున్నారు. గతేడాది భౌతిక, రసాయన జీవశాస్త్ర పరీక్షలు నిర్వహించగా ఈసారి వీటిని రెండు రోజులు అంటే మొత్తం పరీక్షలు ఏడు రోజులు నిర్వహించనున్నారు. ప్రీఫైనల్ పరీక్షల్లో అడిగే ఛాయిస్ ప్రశ్నల విధానం వార్షిక పరీక్షల్లో ఒకేలా ఉండడంతో దీనిపై పూర్తి అవగాహన పెంచుకోవాలని ఉపాధ్యాయులు.. విద్యార్థులకు సూచిస్తున్నారు. పరీక్షలో మొత్తం 80 మార్కులు కాగా.. మిగతా 20 మార్కులు వచ్చిన మార్కుల సరాసరిని తీసుకొని కలుపుతారు.

షెడ్యూల్ ఇదీ..

మార్చి ఒకటిన ఫస్ట్ లాంగ్వేజ్ , రెండో తేదీన సెకండ్ లాంగ్వేజ్, 4న థర్డ్ లాంగ్వేజ్ , 5న గణితం, 6న ఫిజికల్ సైన్స్, 7న బయోలాజికల్ సైన్స్, 11న సోషల్ స్టడీస్ పరీక్షలు ఉంటాయి. మధ్యాహ్నం 1:45 గంటల నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు మొత్తం మూడు గంటలు పరీక్షను నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.